కథ

# ఎలుకల బెడద

- కాకాని చక్రపాణి

"చుంచుమొహంది! నేను ఛస్తే దాన్ని చేసుకోను" అని నేను ప్రతిఘటించాను, అమ్మ తన మేనకోడల్ని నేను పెళ్ళి చేసుకోవాలని ప్రతిపాదించినప్పుడే.

మా నాయనకూడా బావమరిది కూతుర్ని తన కొడుక్కు చేసుకోవాలని భావించలేదు. ఆయన కారణాలు ఆయనకున్నాయి. ఆ ఇంటి పిల్లని కట్టుకుని తను పడ్తున్న బాధలు తన కొడుకు పడకూడదనుకున్నాడు ఆయన.

మా నాయన ఆరోగ్యం గట్టిది. జీవితంలో జిర్రున చీది ఎరుగడు. షుగరు, బిపిల్లాంటివి ఎరుగడు. ఆయనకు జీవితంలో మహా అయిష్టమయిన పని పొద్దున్నే నిద్ర లేవటం. కనీసం పొద్దున ఏడు గంటలదాకా పడుకోటం ఆయనకలవాటు. అలా సుఖపడ్తున్న ఆయన్ని చూసి మా అమ్మ కుళ్ళి పోయేది.




"ఏమిటా నిద్ర పోవటం! మిమ్మల్ని చూసి పిల్లలు చెడిపోతున్నారు. పెద్దవాడు పొద్దున లేవటం మానేశాడు. 'తెల్లవారు ఝామున లేచి చదువుకోరా, చదివింది బుర్ర కెక్కుతుంది' అని నేను నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పినా వాడు వినకుండా తయారయ్యాడు. ఇలా అయితే పిల్లలు బాగు పడ్డట్టే!" అని సాధించి చంపేది. ఆయన్ని తెల్లవారు ఝామునే లేపేది. ఆయన పరిస్థితే అలావుంటే, ఇక మేం పిల్లలం ఏం సుఖపడగలం!

మా నాయన వాపోయేవాడు, "నిన్ను కట్టుకుని నా జీవితంలో ఎంత కోల్పోయానే!" అని.

ఆయన అప్పుడు ఓ ఇంగ్లీషు కంపెనీలో పని చేసేవాడు. స్వతంత్రం వచ్చినా ఇంకా కొంతమంది ఇంగ్లీషువాళ్ళు ఇండియాలోనే ఉండిపోయారు. నాకిప్పటికీ గుర్తు. ఆ రోజు మా నాన్న ఇంటి కొచ్చి మురిసిపోతూ చెప్పాడు. "మా దొరగారు రిటైరై ఇంగ్లాండుకెళ్ళిపోతున్నాడు. ఇంక తీరిగ్గా పెళ్ళి చేసుకుంటాట్ట! మంచి మనిషి! 'చిన్న వయసులోనే పెళ్ళిళ్ళు చేసుకుని మీరు బాధపడుతున్నారోయ్'- అనేవాడు నాతో. తెలిసిన మనిషి! కనకనే ఇప్పుడు అరవైయేళ్ళ వయసులో పెళ్ళి చేసుకోబోతున్నాడు. రిటైరయ్యాకయితే, ఏ పని చెయ్యటానికయినా తీరిక ఉంటుందట!" అని.

"వాడి శ్రాద్ధం! అరవైయేళ్ళకు పెళ్ళేమిటి - అన్నీ ఉడిగి పోయాక!" అంది అమ్మ మెటికలు విరుస్తూ.

"నీకేం తెల్సు- అందువల్ల ఎన్ని ఉపయోగాలున్నయ్యో? హాయిగా ఉదయం ఏడెనిమిది గంటలదాకా పడుకోవచ్చు,

వెచ్చాలు తెచ్చుకోటంలాంటి బాదరబందీ లేకుండా హోటలు భోజనం చెయ్యొచ్చు...''

''చేసేవాడెవడూలేక అర్ధాంతరపు చావూ చావొచ్చు!'' అంది మా అమ్మ సంభాషణకు ముగింపు పలుకుతూ.

మా అమ్మ రీజనుకు నిలబడదని మీకు నచ్చ చెప్పటం కోసమే నేనింత చెప్పింది. అందుకే, నా పెళ్ళి విషయంలో అమ్మకు మరో విధంగా నచ్చ చెప్ప ప్రయత్నించాడాయన.

''జాతకరీత్యా పిల్లదీ - పిల్లవాడిదీ, పిల్లీ-ఎలుకా లాంటి సంబంధమవుతుంది. రోజూ కొంపలో షష్టాష్టకం! శ్రీ లక్ష్మి నీ మేనగోడలు కనకా, పిల్ల బావుం టుంది కనకా వాళ్ళనూ కలుపుదామనుకుంటున్నావు గానీ, జాతకం చెప్పేదాన్ని పెడచెవిన పెడ్తే వచ్చే అనర్థాన్ని నువ్వు పట్టించుకోటం లేదు'' అని తల కొట్టుక చెప్పినా మా అమ్మ వినలేదు. పుట్టింటి మమకారం కళ్ళకు గంతలు కడ్తుంది!

''మరి మా పుట్టింటి పురోహితుడలా చెప్పేడే - పిల్లా, పిల్లాడు పాలూ-నీళ్ళలా కలసి పోతారని! అయినా మా తమ్ముడి పెంపకంలో పెరిగిన పిల్ల ఎలావుంటుందో చెప్పటానికి జాతకాలక్కర్లేదు. నేను మా తమ్ముడికి మాట ఇచ్చాను, చేసుకోక తప్పదు. నా మాట కాదంటే ఎందులోనయినా దూకి ఛస్తాను'' అని మా అమ్మ అల్టిమేటం ఇచ్చాక, ఇంక నాకు తప్పలేదు.



విధి బలీయమయిందని ఎప్పుడో రాజీ పడిపోయాను. మనమనుకుంటాం - జీవితంలో ఏదయినా సాధించగలమని! తప్పు! పెళ్ళాలు, దొంగలు, హంతకులు, దుర్మార్గుల సంగతలా ఉంచండి. పిల్లులూ, ఎలుకలూ కూడా మనల్ని భయభీతుల్ని చెయ్యగలవు!

సుఖంగా గడచి పోతున్న నా జీవితంలోకి శ్రీలక్ష్మీవేంచేసినట్లే, మా ఇంట్లోకి ఓ మూషికమణి ప్రవేశించింది. శ్రీలక్ష్మి గోల పెట్టినా నేను పట్టించుకోలేదు. 'విన్నకొద్దీ విన్పిస్తుంటారు. సాధ్యమైనంతగా విన్పించుకోకపోవటమే మంచిది' అని మా నాన్న నాకెప్పుడో హితవు చెప్పాడు. కొన్నాళ్ళు ఆలుగడ్డలు, ట్రాన్సిస్టరు మీద కప్పిన గుడ్డా లాంటి చిన్నా చితక వాటిని కొట్టేసింది ఆ మూషికమణి. తనకిష్టం లేని పని కొంపలో జరుగుతున్నా, మా ఆవిడ నా నిగ్రహాన్ని ఓ పట్టాన తాను సడలించలేదని అనుభవంమీద గ్రహించినదై, కొంతకాలం మిన్నకుండిపోయింది. ఓరోజు ఆమెకో సందేహమొచ్చింది. ఏమొచ్చినా భరించేవాడు భర్తే కదా! కనుక అదేదో ఆమె నా ముఖాన బద్దలు కొట్టింది.

''నీకేం పట్టదు మగడా! రేప్పొద్దున నీ పుస్తకాలు కొట్టేసినా నన్నడగకు. బజార్లో ఎలుకల మందు తెప్పించి పెడదామనుకున్నా కానీ, జీవహింస మహాపాపం కనుక ఈ వ్యవహారంలో చేతులు కడిగేసుకున్నాను. ఇహ నీ ఇష్టం. నాకూ, పిల్లలకూ దీంతో సంబంధం లేదు'' అని.

ఆ మూషిక మహారాణి నేను ఎంతో కాలం నుండీ పోగేసుకుంటూ వస్తున్న పుస్తకాలను భోంచేస్తే కష్టం కదా! పుస్తకాలంటే వాళ్ళూ వీళ్ళూ ఇస్తారు, వాటిని దాచుకోటానికి బీరువా లెవరూ ఇవ్వరు - అని బెర్నాడ్ షా ఎప్పుడో వాపోయాడు. నా పరిస్థితి అదే! కనుక నేను కాస్తంత బద్ధకం వదిలించుకుని, మా కాంప్లెక్స్ సెక్రటరీని దర్శించి, నా సమస్యని అతని ముందుంచాను.

అతను శ్రద్ధాళువై నా మాటలు ఆలకించినాక, ''అవునోయ్ రమాకాంతం! సిమిలర్ కంప్లైంట్లు నాలుగైదు నా దృష్టి కొచ్చాయి. ఈ ఎలుకల చొరబాటును మనం సంఘటితంగా ఎదుర్కోవాలి. వెంటనే జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేస్తున్నాను. ఫికర్ మత్ కరో. మై హుం న'' అని అభయమిచ్చాడు.

అతను మాట మీద నిలబడే మనిషి, అలాంటి వాళ్ళవల్లే కదా ప్రపంచం నడిచేది! మా కాంప్లెక్సు సంఘ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశాడు, నాకు మాట ఇచ్చినట్లుగానే. ఎక్కువ మంది హాజరు కాలేదు. అది సహజమే మరి! ఎవడి కొంపలోనో మూషిక బాధ అంటే ఎవడికి పడుతుంది. నాలాంటి మూషిక బాధితులే నలుగురైదుగురు జమయ్యారు. అజెండాలో మొదటి ఐటమే 'త్రెట్ ఆఫ్ రొడెంట్స్'. మన - తెలుగు తెగులు - సమావేశాల్ని ఇంగ్లీషులో నడవటం! సహజమే కదా! పెద్ద పెద్ద కాంప్లెక్సుల్లో వివిధ బాషలు మాట్లాడే వాళ్లుంటారు. తెలుగువాళ్ళకు అర్థమైనా, కాక పోయినా ఇతర భాషలవాళ్ళకు అర్థమవాలన్న తాపత్రయం మనది.

''దీనికింత గోలెందుకయ్యా! ఎలుక కన్పించగానే. అలా పట్టేసి, ఇలా చంపేస్తే పోలా? దీనికింత రాద్ధాంతమా? నీగోల ప్రపంచం గోలవ్వాలా? నేను అలాగే చేశాను'' అన్నాడు గుర్నాథం.

నాకు గుర్నాథమంటే ఎప్పటినుండో గుర్రు! అతను ఎడ్డెమంటే తెడ్డెమనే మనిషి!

''చెప్పొచ్చావులేవయ్యా! నాకు మాత్రం తెలీదా? జీవహింస పాపంకదా అని తటపటాయించాను. నువ్వంటే కర్కోటకుడివి! హత్యలయినా చెయ్య గలవు!'' అన్నాను. నా కసలే మంటగా వుంది. పెళ్ళాం ఓడు అంటే లోకమంతా అంటే ఊరుకుంటానా?

గుర్నాథం కస్సుమన్నాడు - నేనేదో అన్‌పార్లమెంటరీ లాంగ్వేజీ ఉపయోగించానట! ఇంతకు ముందేగా తనే ఓ ఎలుకని చంపినట్లు అంగీకరించాడు. ''నోటికొచ్చింది కుయ్యొద్దు. నువ్వు ఇంతకు ముందేగా ఎలుకను హత్య చేసిన విషయం ఒప్పుకున్నావు! అందుకు మన సెక్రటరీనే సాక్ష్యం'' అన్నాను.

''ఓ హో, నువ్వు ఎలుకను చంపిన విషయం మాట్లాడావా, నేను మనుషుల సంగతేమోననుకున్నాను'' అన్నాడతను సర్దుకుంటూ.

''నీ కంత సీను లేదులే'' అన్నాను.

అతను మరేదో కుయ్యబోయాడు కానీ, సెక్రటరీ వారించాడు, ''మనం సమావేశమైన విషయం వది

లేసి మిగతావన్నీ మాటడతారెందుకు?'' అంటూ.

బలరాం కూడా నాలాగా జీవహింసే పరమ ధర్మ మనుకునే మనిషి.

''హింసాత్మకం కాని మార్గమేదయినా ఉంటే చెప్పండి'' అనడిగాడతను.

''మనం ఓ పిల్లిని పెంచుకుంటే సరి! దాని భయంతో ఎలుకలు తోకముడుస్తాయి'' అని సూచించాడు సెక్రటరీ.

గుర్నాథం ఆ సూచనను వ్యతిరేకించబోయాడు కానీ మేం ''గుర్నాథం డౌన్ డౌన్'' అని కోరస్‌గా గొంతెత్తే సరికి, తన ప్రజాస్వామ్య హక్కు కేదో భంగం కలిగిందంటూ, తన నిరసనను తెలియబరుస్తూ, సభనుండి వాకౌట్ చేశాడతను. ప్రజాస్వామ్యమన్నాక, తన మాటే చెల్లుబాటు కావాలన్న నిరంకుశపు పట్టుదల పనికి రాదు.

''పోనీ ఓ పని చేస్తే సరి! పొద్దున్నే లేచి మార్జాలాసనం వేస్తే, తారెత్తిన మూషికాలు పలాయనం చిత్తగిస్తాయి'' అంటూ తన అమూల్యాభిప్రాయాన్ని సెలవిచ్చాడు వెంకటరమణ.

అయితే, ఆసనాలు వగైరా బిసి కాలం నాటివి. వాటికిప్పుడు చెల్లుబాటు లేదు. అతని మాటల్ని మావాళ్ళెవరూ సీరియస్‌గా తీసుకోలేదు. మా కార్యదర్శి ఎప్పుడూ రెడీ. 'పనులు చేయిస్తూంటే కదా, నాలుగు డబ్బులు మిగుల్చు కోటం కుదిరేది' అని కొంతమంది గిట్టనివాళ్ళు కూస్తుంటారు. గానీ అదేం పట్టించుకోవల్సిన విషయం కాదు. మెజారిటీ నిర్ణయాన్ని అమలు పర్చే బాధ్యత మా కార్యదర్శి తన భుజస్కంధాల మీద వేసుకున్నాడు. మార్జాల సేకరణ కతనెంత ఖర్చుపెట్టాడో, ఏం పడరాని పాట్లు పడ్డాడో నాకు తెలియదు కానీ, ఓ దుండు ముండ పిల్లిని తెచ్చి, దాన్ని మా కాంప్లెక్సు వాచ్ మన్ సంరక్షణలో పెంచసాగాడు.

మంచి జాతి మార్జాలమనీ, దాని సంరక్షణ అదనపు బాధ్యత కనుక వాచ్‌మన్ జీతం కూడా పెంచాల్సి వచ్చిందనీ చెప్పాడు మా కార్యదర్శి. 'డబ్బు పోతే పోయింది, ఎలుకల పీడ వదలాల'ని మేమంతా దేవుణ్ణి ప్రార్థించాము. మా కాంప్లెక్సు జనమంతా దాన్ని అల్లారు ముద్దుగా చూసుకోసాగారు.

అయితే, 'మాన్ ప్రొపోజెస్ గాడ్ డిస్పోజెస్' అన్న నానుడి వుండనేవుంది. పిల్లికి కూడా మా అహింసావాదం పట్టుబడినట్టుంది, అది ఎలుకల్ని భయపెట్టటం కూడా మానేసింది. ఎలుకల్ని అది పట్టాలని మేమెప్పుడూ ఆశించలేదు. పిల్లి ఉంటే ఎలుకలు పారిపోతాయన్న సాధారణ సూత్రాన్ని అమలుచేయ ప్రయత్నించి విఫలమయ్యాం. సహజీవన సౌందర్యాన్ని మేమూ అనుభవించసాగాం కానీ ఊహించని కోణం నుండి మరో ప్రమాదం ముంచుకొచ్చింది.

చెప్పాను కదా – ఇంతకు ముందే, నాకు పొద్దున్నే లేచే అలవాటు లేదని! మా నాయన పోలిక! బూతు నుండీ పాలు తేవటానికి ఓ కుర్రాడిని ఏర్పాటు చేసుకున్నాను. ఎంత చచ్చినా, సుఖం పడే విషయంలో మాత్రం రాజీ పడలేను. సుఖం లేని బతుకూ ఒక బతుకేనా? ఆ కుర్రాడు తెల్లవారు ఝూమునే మిల్క్ పాకెట్ గుమ్మం ముందు పడేసి వెళ్లేవాడు. పాల పాకెట్ డెలివర్ చేసినట్టు డోర్‌బెల్ కూడా మోగించేవాడు. అయితే, మా ఆవిడ తలుపు తీసి పాల పాకెట్ తెచ్చుకోటంలో ఏమాత్రం జాప్యం చేసినా, కాంప్లెక్సు పెంపుడి పిల్లి వచ్చి వెంటనే పాకెట్‌ను కొరికేసేది. పాపం పిల్లులకు పాలంటే ఇష్టం కదా! జుర్రుకుందామన్న తాపత్రయం! ఇతరుల వస్తువులకోసం పాకులాడితే చేతికేది అందదన్న సత్యం ఆ మార్జాల మహారాణికి తెలియదు. మా ఆవిడ రాగానే అది పారిపోయేది. ఎవరికీ కాకుండా పాలు నేలపాలయేవి. నన్ను తిట్టుకుంటూ మళ్ళీపాలబూతు కెళ్ళి, పాలు తెచ్చుకునే

''దీనికంత రాద్ధాంతమా? అందుకు బంగారం లాంటి నా నిద్ర చెడగొడతావా?'' అన్నాను కోపంగా.

''నిద్ర! సాగితే నేను నిద్రపోగలను. నా ముఖాన అంత అదృష్టం తగలడితేగా? నా ఖర్మ! నా బతుకు బండలు చేశాడు మా నాయన.''

''సర్లే, ఇంతోటి దానికి పోయిన మనిషిని ఆడిపోసుకోటమెందుకూ? ఓ ప్లాస్టిక్ బాగు బయట గడియకు తగిలించు. పాల కుర్రాడితో పాల పాకెట్లనందులో వెయ్యమని చెప్పు. బుర్రతో ఆలోచిస్తే మార్గం దొరక్కపోదు'' అని ఆలోచన చెప్పి, దుప్పటిలో ముసుగు తన్నేశాను.

దావిడ. ఇలా రెండుమూడు రోజులు జరిగాక, ఓ రోజు తెల్లవారుఝూమునే నన్ను లేపి, ''పుట్టి ముంచుకుపోతున్నా నీ నిద్ర నీదే. ఇంక నేను సంసారం చెయ్యలేను'' అని రొప్పుతూ, రోజుతూ జరిగిన ఘోరం చెప్పింది.

''దీనికంత రాద్ధాంతమా? అందుకు బంగారం లాంటి నా నిద్ర చెడగొడతావా?'' అన్నాను కోపంగా.

''నిద్ర! సాగితే నేను నిద్రపోగలను. నా ముఖాన అంత అదృష్టం తగలడితేగా? నా ఖర్మ! నా బతుకు బండలు చేశాడు మా నాయన.''

''సర్లే, ఇంతోటి దానికి పోయిన మనిషిని ఆడిపోసుకోటమెందుకూ? ఓ ప్లాస్టిక్ బాగు బయట గడియకు తగిలించు. పాల కుర్రాడితో పాల పాకెట్లనందులో వెయ్యమని చెప్పు. బుర్రతో ఆలోచిస్తే మార్గం దొరక్కపోదు'' అని ఆలోచన చెప్పి, దుప్పటిలో ముసుగు తన్నేశాను.

''నా రాత!'' అని నన్ను శపించి, ఆ తర్వాత నా ఆలోచన అమలు చేసింది ఇంటావిడ.

రెండు రోజులు ఏ అవాంతరం లేకుండా గడిచాయి. మూడోరోజు తెల్లవారుఝామున తలుపు తెరచిన మా ఆవిడ గుండెలు బాదుకుని విలపించటంతో నిద్రోపహతుడనై వచ్చి చూసేసరికి నేల పాలసంద్రంలా ఉంది. ప్లాస్టిక్ పాకెట్టునుండి పాలు ధారగా కారుతున్నయ్యి. దూరంగా మెట్లమీద నిలబడిన పిల్లి ఆవిడ వంక గుర్రుగా చూస్తోంది.

''చూశావుగా? ఇంకేం చెయ్యాలో ఆలోచించు. ముందుగా వెళ్ళి రెండు పాకెట్ల పాలు పట్టుకురా'' అని ఓ అరుపు అరిచి లోపలకు వెళ్ళిపోయింది మా ఆవిడ.

మళ్ళీ విషయాన్ని సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళటమూ, అతను సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయటమూ జరిగింది. అతను మా కంప్లయింట్ విన్నవాడై, బట్టతల గోక్కుని, ''సింపుల్! ఓ కుక్కను పెంచితే సరి!'' అన్నాడు.

'కౌపీన సంరక్షణార్థం ఆయనం పటాటోపః' అన్నట్టుంది పరిస్థితి.

''అందులో ఎంత కొట్టేద్దామనీ'' అన్నాడు గుర్నాథం.

''నిన్ను సెక్రటరీ చేస్తాం. ఆ కొట్టేసే పనేదో మొదలెట్టు'' అని ఉగ్రంగా హుంకరించి సెక్రటరీ లేవగానే, అతన్ని బుజ్జగించేసరికి మా పుత్రమారింది.

''ముందు ఆ పిల్లిని వదిలించు. చెడు తిరుగుళ్ళు తిరిగి అది కడుపు కూడా తెచ్చుకుంది. అది పిల్లల్ని పెట్టిందంటే, ఎలుకలకు తోడు పిల్లి పిల్లల బాధ కూడా పడాల్సి వస్తుంది'' అంది బలరాం భార్య. చెప్పొద్దూ – ఆవిడ మహా పతివ్రత, తప్పుడు పనంటే భరించలేని మనిషి!

''మరో మాట! మగాళ్ళందరూ పొద్దున్నే లేచి పాలు తీసుకురావాలన్న తీర్మానం చెయ్యాలి మనం. వాళ్ళ బద్ధకం వదిలితే కాంప్లుక్సు పీడ సగం విరగడవుతుంది'' అంది మా ఆవిడ.

''అదెట్లా కుదురుతుంది. మా ఆయన ఎప్పుడో అర్థరాత్రి వచ్చి పడుకుంటారు. పొద్దున్నే లేవటం ఆయన వల్ల కాదు'' అంది నీరజ. ఆ పిల్లకు కొత్తగా పెళ్ళయింది. ఇంకా మొగుడంటే మురిపెం తీరలేదు.

''ఇలా మొగుణ్ణి నెత్తికెక్కించు కున్నావంటే, ఆ తర్వాత పశ్చాత్తాప పడవల్సి వస్తుంది'' అని మా ఆవిడ వార్నింగు ఇచ్చినా ఆ పిల్ల వినిపించుకోలేదు. కనుక మా ఆవిడ ప్రతిపాదన వీగిపోయింది. నాకానందం కలిగింది.

''పిల్లిని వదిలించటానికి మళ్ళీ సెక్రటరీ ఎంత తగలెడతాడో!'' అని కూశాడు గుర్నాథం.

''మరి తప్పదు. డబ్బుకు వెనకాడితే ఎలా అభివృద్ధి సాధించగలం!'' అన్నాడు సెక్రటరీ.

మళ్ళీ మా కార్యదర్శి మహాశయుడు నడుం కట్టాడు. ఏంతంటాలు పడ్డాడో ఏమోకానీ, పిల్లి నుండి మాకు మోక్షం కలిగించాడు.

పిల్లి కాంప్లెక్సులో ఉన్నంత కాలం మా ఇంట్లోని మూషికామణి కొంత అణగిమణగి ఉంది.

''పిల్లల్ని పెడ్తోందేమోనయ్యా!'' అంది మా ఆవిడ, సందేహం వెలిబుచ్చుతూ. అనుమానం పక్షి!

''ఛ,ఛ. మాట్లాడకు. దానికంత ధైర్యమా?'' అన్నాను.

పిల్లికి ఉద్వాసన పలికాక ఎలుక రెచ్చిపోయింది. నా పుస్తకాల పాత కంపు దానికి పడినట్టులేదు.

వాటిని ముట్టుకోలేదు అది. మా పిల్లల పుస్తకాలు కొత్తవి. అలమారులో అందుబాటులో ఉంటే, రోజుకి కొన్నింటిని భోంచెయ్యసాగింది. పిల్లలు గోల పెట్టగానే, పిల్లల తల్లికి కోపం వచ్చింది.

''ఏం మగాడివయ్యా! ఎలుక పీడనే వదిలించలేక పోయావు!'' అంది.

''నేనేం చేయను. జీవహింస కూడదంటివి, నాచేతులు కట్టేస్తివి. లేకపోతే దాని పీడ ఈపాటికి వదిలించేవాడిని'' అని బీరాలు పోయాను.

పక్కింటి గుర్నాథంలా దాన్ని పట్టి పరిమార్చగల ధీరోదాత్తుడు తన మొగుడు కాదని ఆమె ఎప్పుడో నిర్ణయానికొచ్చింది. ఈసారి జీవహింస లాంటి అభ్యంతరాలు చెప్పలేదు కనుక, నేను నడుం బిగించి, బజారు కెళ్ళి, ఎలుకల మందు కొనుక్కు వచ్చాను.

నేను మహదానందపడిపోయాను. మా ఆవిడ పిల్లల మీద ప్రేమతో, తన అహింసా వ్రతానికి తిలోదకాలిచ్చి, మందు కలిపిన ఆ విషాహారాన్ని ఆ రాత్రి ఎలుక తిరుగాడే నాలుగు చోట్ల పెట్టింది. 'మర్నాటికి అది చస్తుంది, ఏ మూల దాని శవ ముంటుందో, ఎట్లా దాని కళేబరాన్ని బయటికీడ్చి పారెయ్యాలి' అన్న దిగులుతో నాకా రాత్రి నిద్ర పట్టలేదు. తీరా తెల్లవారి లేచి చూస్తే, అన్నం మాయమైంది కానీ, మమ్మల్ని వెక్కిరిస్తున్నట్టుగా, ఆ మూషికామణి గోడ వారగా పరుగెత్తుకుంటూ వెళ్ళి అదృశ్యమైంది. అది కల్తీ మందు అని తేలి పోయింది.

''చూశావుగా నీ నిర్వాకం!'' అన్నట్టు చూసింది మా ఆవిడ నా వంక.

ఓ మిత్రుడు, ''సాయంత్రం మందు పార్టీ పెట్టు. ఫ్రెండ్సందరం కల్సి, చర్చించి, సమస్యకు పరిష్కారం కనుగొందాం. నీ కష్టం మా కష్టం కాదూ?'' అన్నాడు.

'సాధనమున పనులు సమకూరు ధరలోన' అని పెద్దలన్నారు కదా! అదే పని చేశాను. వెధవలు నా డబ్బుతో మందు తాగి ఆ కబురూ ఈ కబురూ చెప్పారుగానీ, నా సమస్యకు తరుణోపాయం చెప్పటంలో అలసత్వం ప్రదర్శించారు.

చివరికి ఓ మిత్రుడు, ''పెస్టిసైడ్ కేక్స్ దొరుకుతాయి, ఏ షాపులోనయినా. అవి తెచ్చి పెట్టు. నీ ఎలుక చచ్చి ఊరుకుంటుంది'' అన్నాడు.

''అవి ఇప్పుడు దొరకటంలేదు'' అన్నాడు మరొకడు.

మర్నాడు శలవపెట్టి, సందేహిస్తూనే చెడతిరిగి, చివరికెలాగో వాటిని సేకరించగలిగాను. మా ఆవిడ ఈ సారి నా ప్రయత్నాలకు సహకరించలేదు. మేనత్త కొడుకూ ఒక మొగుడేనా అన్న చులకన భావం ఆమెకెప్పటినుండో ఉంది. ఆ కేకుల పంపిణీ కార్యక్రమం నేనే చేపట్టాను ఆ రాత్రి ఎలుక చచ్చినట్టు కలగన్నాను. తెల్లవారుఝామున, మా ఆవిడ చేసిన ఛీత్కారంతో నాకు ఒక్కసారిగా మెలకువ వచ్చింది.

''ఏమయింది, అట్లా అరుస్తున్నావు? క్షణం కొంపలో హాయిగా నిద్ర పోయే అవకాశం లేదు!'' అన్నాను, నిద్రమత్తులో ధైర్యంచేసి.

''నా శ్రాద్ధమయింది! ఇంత సమర్థుడయిన మొగుడుంటే ఇంకేమవుతుంది? చూడు, అలమారులో పట్టుచీరలెలా కొట్టేసిందో? ఒకటి నా పెళ్ళికి మా నాన్న కొనిచ్చిన చీర, ఇంకోటి నేను పెద్దవాడిని కడుపుతో ఉన్నప్పుడు మా అమ్మ పెట్టిన చీర – అన్నీ మావాళ్ళు పెట్టిన చీరలే కొట్టేసింది. ఈ ఎలుక క్రితం జన్మలో మా అత్తింటి బంధువై వుంటుంది. పగబట్టినట్టు మా పుట్టింటివాళ్ళు పెట్టిన చీరలు ధ్వంసం చేసింది....'' అంది.

''మీ మేనత్త పెదతమ్ముడై వుంటుంది'' అన్నాను.

''అంటే మానాన్న! పోయినా మా నాన్న మీద అభాండాలా? మానాన్న ఎలుకై పుట్టాడంటావా? నీ నోరు పడ...'' ఆ తర్వాత మాటలు నేను చెప్పకూడదు, మీరు వినకూడదు. 2008 నవంబరు 26న మొదలెట్టి మూడు రోజులు ముంబైపై పాకిస్తాను ముష్కరులు సాగించిన బీభత్సకాండ పట్ల భారతీయులు ప్రదర్శించిన ఆగ్రహాన్ని తలపింప చేసేట్టుగా వుంది, శ్రీలక్ష్మి కృద్ధురాలైన వైనం.

పెట్టిన కేకులు ముట్టిన పాపాన పోలేదు. ఎలకలూ తెలివిమీరిన పిదపకాలం!

ఫైనల్ అల్టిమేటం ఇచ్చేసింది ఆవిడ, ''ఏం చేస్తావో నాకు తెలీదు. రేపటిలోగా అది చచ్చిపోవాలి. కొంపలో అదయినా ఉండాలి, నేనయినా ఉండాలి'' అంటూ.

ఇంక నిద్రకుపక్రమించే ధైర్యం చెయ్యలేక పోయాను. ఆఫీసుకెళ్ళి, నా సన్నిహిత మిత్రుడు సత్యనారాయణను సాయంత్రం ఆఫీసుకు జరూరుగా రావల్సిందని ఫోను చేశాను. అతనొచ్చాక, నా సమస్యనతని ముందుంచి, ''ఇక నా సంసారం భారం నీదే''నన్నాను. మారు మాట్లాడకుండా నన్ను బజారుకు తీసుకెళ్ళి ఓ రొడెంట్ గమ్ బోర్డ్ కొని పెట్టాడు అతను. డెబ్బై రూపాయల ఖరీదది. తెరిస్తే, లోపలంతా జిగురు, బంక. ''రాత్రికి ఎలుక తిరిగే చోట పెట్టు. దీంట్లో కాలు పెట్టిందా, ఇంక బయటకు రావటం కల్ల. నీ సమస్య తీరినట్లే ఫో'' అన్నాడు.

ఇంట్లో సహాయనిరాకరణోద్యమం కొనసాగుతోంది. రాత్రి పడుకోబోతూ ఆబోర్డు ఎలుక సంచరించే చోట పెట్టి, ''జాగ్రత్త! ఎవరయినా పొరపాటున దీనిమీద కాలు వేస్తారేమో, అతుక్కుంటే వదిలించుకోటం కష్టం'' అని పిల్లలకూ, పిల్లలతల్లికీ చెప్పాను.

వాళ్లు ''ప్చ్'' అని చప్పరించేశారు. నావల్ల ఏమీ కాదని వాళ్ళ అభిప్రాయం.

నాకు నిద్ర పట్టలేదు. మనసులో దిగులు, ఆరాటం. రేప్పొద్దున లోగా ఎలుక చావకపోతే, నా తిప్పలు దేవుడెరుగు! మా ఆవిడ పిల్లలతో పుట్టింటికి ప్రయాణం కట్టటం ఖాయం. ఓ నిద్ర మాత్ర వేసుకుంటేనయినా నిద్ర పడుతుందేమోనని లేచి, లైటు వేసి, ఎలుక కోసం తెరచి ఉంచిన అట్ట వైపు చూశాను.


దొంగ మొహంది! అట్టకు అతుక్కుపోయి ఉంది. తల వంచుకుని అటూ, ఇటూ తిప్పుతూ కూర్చుంది. నాతో వాదనలో ఓడి పోయినప్పుడు మా ఆవిడ అలాగే కూర్చుంటుంది. మరింత పరికించి చూస్తే, మా మామ, బామ్మర్ది రూపు రేఖలు కూడా దానిలో కన్పించాయి.

''హురే'' అంటూ ఎగిరి గంతేశాను. ''పట్టేశాను, పట్టేశాను'' అని సంతోషం పట్టలేక అరిచాను. ఆర్కిమిడిస్ ఇలాంటి సంతోషం పట్టలేకే, ''యురేకా యురేకా'' అంటూ గంతులేసి, సిరాక్యూజ్ నగర వీధుల్లో బట్టల్లేకుండా తిరిగాడు.

ఆవిడా, పిల్లలూ లేచారు. మా ఆవిడ ఆనందం వర్ణనాతీతం! అయినా నా సామర్థ్యం ప్రశంసించ నోరు రాదు ఆవిడకు.

''ఇంతోటి దానికి అంత అరుపులెందుకూ! నీలాంటి వాడే ఎవడో కొండను తవ్వి ఎలుకను పట్టాట్ట!'' అని చప్పరించేసింది, నా చుంచు మొహం పెళ్ళాం.

చివరకు మా వాచ్‌మన్‌ను పిలిచి, అతని సాయంతో ఆ మూషికమణికి ఉద్వాసన పలికి,



మనశ్శాంతితో, ఎలుకను జయించిన ఆనందంతో నిద్రకుపక్రమించాను.

మర్నాడు నా ఆనందాన్ని హరించేటట్లు అవతరించాడు మా బావమరది. వాడిని చూస్తేనే నా ప్రాణం కడబట్టింది. 'ఆ మూషికామణిని ఎలాగో వదిలించుకున్నా. ఈ చుంచుమొహం వెధవ తిష్ఠవేశాడంటే ఓ పట్టాన వదలడు' అనుకుంటే నా మెదడు మోకాళ్ళలోకి జారింది. నెలకొకసారయినా గవర్నమెంటు ఆఫీసుల్లో పనంటూ తన ఊరి నుండి తగలడతాడు. వచ్చాడంటే వారం, పది రోజులు తిష్ఠ వెయ్యకుండా వదలడు. ఇంక మా ఆవిడకు తమ్ముడిని చూస్తే, తన పోయిన తండ్రిని చూసినంత ఆనందం కలుగుతుంది.

ఈ ఎలుక నా ఇంట్లో ప్రవేశించిందంటే ఇంక నాకు స్వాతంత్ర్యం ఉండదు. సాయంత్రం ఆఫీసు నుండి వచ్చి కాస్తంత సేపు టివి పెట్టుకుందామంటే కుదరదు. రిమోట్ మా బామ్మర్ది కబ్జాలో ఉంటుంది. వాడు ఛస్తే దాన్ని నాకివ్వడు. ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలుసుకుందామన్న తహతహతో, ''వార్తలు పెట్టరా కాస్తసేపు'' అన్నా వాడు విన్పించుకోడు.

''ఏంటి బావా, నీగోల! కథ మంచి రసపట్టులో వుంది. డిస్టర్బ్ చెయ్యకు'' అని కసుర్తాడు, టివి తెరలోని సినిమాకు మొహమతికించి.

లేదూ నా ఐపాడ్ చెవుల్లో తురిమి, వాడికిష్టమయిన పాటలు అందులో లోడ్ చేసి డాన్స్ చేస్తుంటాడు. వాడి కోతి చేష్టలకు మా ఆవిడ మురిసిపోతూంటుంది. నేనేమన్నా అంటే, ''చాల్లే, మన సంగతే చెప్పాలి! జీవితంలో ఓసరదా లేదు, సరాగం లేదు. మనం సరదాగా ఉండం, ఇంకోళ్ళని ఉండనియ్యం'' అంటుంది.

వాడి రాకతో కొంపలో రోజూ విందు భోజనమే. ఇంటి ఖర్చు తట్టుకోటం కష్టమయిపోయేది. ఏమన్నా అంటే ఏడు తరాల నుండి మా వంశంలో గూడు కట్టుకుని వున్న నికృష్ట లుబ్ధత్వం, పిసినారితనం గురించి లెక్చరిస్తుంది మా ఆవిడ. అందుకే వాడు కొంపలో నుండి వెళ్ళేదాకా నేను నోరు తెరవను. వాడు నన్ను చిన్న చూపు చూస్తున్నాడన్న అనుమానం నాకెప్పటినుండో ఉంది.

అందుకే వాడు ''ఏవిటి బావా, విశేషాలు?'' అని అడిగితే, నా ఈ రీసెంట్ సాహసకృత్యాన్ని అభివర్ణించి వాడికి చెప్పాను. అప్పటికయినా నా గొప్పదనం అణుమాత్రమయినా ఆ బండ బుర్రలోకెక్కుతుందేమోనని. అహా, ఈజీవులు వేరు. అందుకు వాడి ప్రతిస్పందన వినండి.

''ఇదేదో ఘనకార్యమన్నట్టు మహా గొప్పగా చెప్తున్నావే బావా! ఆ అట్ట తెచ్చి పెట్టావు. బుద్ధిలేని ఎలుక ఆ అట్ట మీదకు నడచి ఇరుక్కుపోయింది ఇంతేగా! ఇందులో నువ్వు చేసిందేముంది! కనీసం దాన్ని చంపలేక పోయావు!'' అన్నాడు.

ఆ వంశమే అంత! చుంచుమొహం మనుషులు! ఎవరి గొప్పదనాన్నీ సహించలేరు.

''ఎవరో అన్నారు – పెద్ద పెద్ద ఉద్యమాలు కూడా మూషికాల్లాంటి అల్పజీవుల వల్లే భగ్నమవుతాయట! అప్పుడు ఇంట్లో ఎంత హింస భరించాననుకున్నావు! అనుభవిస్తే తెలిసొచ్చేది. అనుభవమయితేగానీ మూర్ఖులకు తెలిసి రాదంటారు!'' అన్నాను.

''ఆ మాట నిజమేలే!'' అని కిసుక్కున నవ్వాడు కొక్కిరి వెధవ!

అంతలో వంటింట్లో నుండి కెవ్వున కేక వినపడింది. ఏమిటా అని మేమిద్దరమూ లోపలికి పరుగెత్తాము. రెండు ఎలుక పిల్లలు మమ్మల్ని వెక్కిరిస్తూ నిర్భయంగా మా ఎదుటే పరుగెత్తుకుంటూ వెళ్ళి మాయమయ్యాయి. అంతకు ముందు మా ఆవిడ వెలిబుచ్చిన సందేహం నిజమేనన్నమాట! పాత ఎలుక ఎక్కడ చచ్చిందో గానీ, కొత్తగా దాని పిల్లలు రెండు కొంపలో అవతరించాయి. ఇంక బామ్మర్ది మూషికం ఎప్పుటి దాకా ఉంటాడో నాకు తెలియదు. కొంపో ఎలుకల కలుగయిపోయింది! ఈ ఎలుకల బెడద వదిలేదెప్పుడు?

*

చిరునామా:
డా. కె. చక్రపాణి
6-1-149/10, ఫ్లాట్ నెం. 101,
విశ్వంభరా అపార్ట్‌మెంట్స్,
పద్మారావు నగర్, సికింద్రాబాద్ – 500 025.
ఫోన్: 2750 1409

